క్లుప్తంగా

ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ



గంగమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజలో పాల్గొన్న గ్రామ పెద్దలు.ప్రజలు

బనగానపల్లెరూరల్: మండలంలోని పసుపల గ్రామ పంచాయతీలోని పెద్దరాజుపాళెం శివారుప్రాంతంలో ఎర్రమలకొండల్లో శిథిలావస్థలో ఉన్న గంగమ్మ ఆలయ పునర్నిర్మాణానికి శుక్రవారం గ్రామ పెద్దలు, ప్రజల భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మోహన్‌బాబు మాట్లాడుతూ పురాతన ఆలయాన్ని దాతల సహకారంతో పునిర్నిర్మాణం చేపట్టాలని, ప్రతిఒక్కరూ తమవంతు సహకారం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో పెద్దలు భూషణ, మద్దిలేటిస్వామి, చిన్న కొండయ్య,గొల్లరాముడు, మాధవ, బోయ మద్దిలేటి స్వామి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మౌలాలి స్వామి గంధం

ప్యాపిలి: మండల పరిధిలోని పోదొడ్డి గ్రామంలో మౌలాలి స్వామి ఉరుసు ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం అర్ధరాత్రి స్వామి వారి గంధం ఊరేగింపు వైభవంగా జరిగింది. శుక్రవారం భక్తులు అధిక సంఖ్యలో హాజరై మౌలాలి స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం తెల్లవారుజామున గ్రామ పురవీధుల మీదుగా స్వామి వారి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తారు. ఉదయం గుర్రం కొండపైకి ఎక్కే సన్నివేశాన్ని తిలికించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.

బోధనా సామగ్రి అందజేత

ప్యాపిలి: మండల పరిధిలోని గుడిపాడు ప్రాథమిక పాఠశాలకు విజయవాడకు చెందిన వ్యాపారి ఈశ్వర్ బోధనా సామగ్రిని అందజేశారు. మండల పరిధిలోని నల్లమేకలపల్లి వద్ద ఉన్న వాల్మీకి గుహలను సందర్శించేందుకు వెళ్తున్న ఈశ్వర్ మార్గమధ్యంలో ఉన్న ప్రాథమిక పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో కాసేపు గడిపారు. అనంతరం విద్యార్థుల కోసం బోధనా సామాగ్రిని సర్పంచ్ శ్రీనివాసులు, హెచ్‌ఎం కీర్తిచందర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ప్రిన్సిపాల్ మృతికి నివాళి

కోవెలకుంట్ల: కోవెలకుంట్లకు చెందిన రిటైర్డ్ ప్రిన్సిపాల్ జనార్దనశెట్టి మృతి పట్ల ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనారోగ్యంతో బాధపడుతు జనార్దనశెట్టి గురువారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యేతో పాటు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, మేజర్ గ్రామ పంచాయితీ ఉప సర్పంచ్ సూర్యనారాయణరెడ్డి, ఏపీ ఎన్జీఓ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గువ్వల రామకృష్ణారెడ్డి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండెకంటి సుబ్రహ్మణ్యం మానవత స్వచ్ఛంద సంస్థ చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి తదితరులు శుక్రవారం కోవెలకుంట్లకు చేరుకొని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సంతాపం

ప్యాపిలి: రిటైర్డ్ ఎంఈఓ తిమ్మప్ప మృతి పట్ల ఎంఈఓ శ్రీనివాసులు, కార్యాలయ సిబ్బంది మద్దయ్య, రామాంజనేయులు, భువనేశ్వరి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. చిన్న పొదిళ్ల హెచ్‌ఎంగా పనిచేసిన తిమ్మప్ప రెండేళ్ల పాటు ప్యాపిలి ఎంఈఓగా సేవలు అందించారు. అనంతరం ఆయన పదవీ విరమణ పొంది కర్నూలులో నివాసం ఉంటున్నారు. గురువారం రాత్రి గుండెపోటుతో ఆయన మృతి చెందారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కోవెలకుంట్ల: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఆర్‌జేయూపీ 2023 క్యాలెండర్, డైరీని జిల్లా గౌరవ అధ్యక్షుడు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, హెచ్‌ఎం అరుణకుమారి, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, సుగుణ, కృష్ణవేణి, శ్రీదేవి, వహిదా, మృణాళిని, సువర్ణ, మంజుల, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్

ప్యాపిలి: జగనన్న కాలనీల్లో ఇంటి పట్టా పొంది ఇప్పటి వరకు నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులు వెంటనే ప్రారంభించాలని తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ సూచించారు. స్థానిక జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలు చేపట్టని వారితో శుక్రవారం వారు మాట్లాడారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం దశలవారీగా రూ. 1.8 లక్షలు మంజూరు చేస్తోందన్నారు. బిల్లు మంజూరు కావడం లేదని కొందరు లబ్ధిదారులు తెలుపడంతో సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని హౌసింగ్ ఏఈ వెంకటేశ్‌ని ఆదేశించారు.



ప్రధాన రహదారిపై లైట్ల వెలుతురులో వెళ్తున్న వాహనం



పంట పొలాలను దుప్పటిలా కప్పేసిన మంచు



పొగమంచు ముందు చిన్నబోయిన సూర్యుడు

వీడని పొగమంచు!

కోవెలకుంట్ల/కొలిమిగుండ్ల: చలి కాలం ముగుస్తున్నా పొగమంచు వీడడం లేదు. బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 6 నుంచి 8గంటల వరకు దట్టమైన పొగమంచు కురిసింది. మంచుపొగ తప్పా ఏమీ కనిపించడం లేదు. దీంతో బయటకు వచ్చేందుకు జనం జంకుతున్నారు. ఉదయం సూర్యుడు కనిపించని పరిస్థితి. జమ్మలమడుగు నంద్యాల, ఆళ్లగడ్డ, తాడిపత్రి తదితర రహదారులను పొగమంచు కప్పేయడంతో వాహనాల రాకపోకలు కష్టంగా మారాయి. మండల కేంద్రం కొలిమిగుండ్లను తెల్లవారు జామున మంచు దుప్పటిలా కప్పేసింది. వాహన చోదకులు లైట్లు వేసుకొని రాక పోకలు కొనసాగించారు. ఈఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన పప్పు శనగ, జొన్న, మినుము, పెసర తదితర పంటలు చేతికి అందడంతో రైతులకు ఇబ్బందులు తప్పాయి.

భక్తిశ్రద్ధలతో శ్రీ చౌడేశ్వరీదేవి పల్లకీ సేవ

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి పల్లకీ సేవా భక్తిశ్రద్ధల మధ్య సాగింది. ఈఓ రామానుజన్, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేసి పల్లకీ సేవా కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా చౌడేశ్వరీ విగ్రహ ప్రతిష్ఠ

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాలలో గ్రా మస్తులు, భక్తుల సహకారంతో సుమారు రూ.30 లక్షలతో నిర్మించిన చౌడేశ్వరీ ఆలయంలో శుక్రవారం విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీటీసీ సభ్యురాలు రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

30న ఏకసభ్య కమిటీ కమిషన్ పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

- వాల్మీకులు తమ స్థితిగతులను విన్నవించుకోవాలి
- ఆర్డీఓ వెంకటరెడ్డి

డోన్ టౌన్: వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలనే అభ్యర్థన మేరకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ ఈ నెల 30వ తేదీన డోన్, ప్యాపిలి మండలాల్లో పర్యటించనున్నట్లు ఆర్డీఓ వెంకటరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం తన ఛాంబర్‌లలో అధికారులు, వాల్మీక సంఘం నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏకసభ్య కమిటీ కమిషన్ పర్యటన వివరాలను ఆర్డీఓ తెలిపారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శ్యాముల్ ఆనంద్ కుమార్ వాల్మీకుల ఆర్థిక స్థితి గతులు, జీవన విధానం గురించి తెలుసుకునేందుకు ప్యాపిలి మండలం బోయవాండ్లపల్లె, సంజీవరాయుడి పురం, డోన్ మండలంలోని చనుగోండ్ల, ధర్మవరం తదితర గ్రామాల్లో పర్యటిస్తారన్నారు. వాల్మీకులు తమ స్థితిగతులను కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ మధు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, న్యాయవాదులు భాస్కర్‌నాయుడు, కృష్ణమూర్తి, ఆర్మీ రామయ్య, అశోక్, రైల్వే నాయుడు, ధర్మారం శ్రీరాములు, అబ్బిరెడ్డి పల్లె సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

- మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్ : ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యమని, డోన్ పట్టణాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలను స్థానికులు కౌన్సిలర్ల దృష్టికి తీసుకొస్తే అధికారులకు వివరించి పరిష్కార చర్యలు చేపడుతామన్నారు. స్థానిక 13వ సచివాలయం పరిధిలోని వైఎస్ఆర్ నగర్‌లో శుక్రవారం కమిషనర్ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ మహేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో చైర్మన్ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి కాలనీల్లో విస్తృతంగా పర్యటించిన చైర్మన్ ప్రభుత్వం మూడేన్నరేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరించడంతోపాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి చేకూరిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి, లంచగొండితనం నిర్మూలించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో పాటు ప్రతి 50 ఇళ్లకు ఓ వలంటీర్‌ను నియమించారన్నారు. పార్టీలు, కులమతాలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా పేదల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా జగనన్న సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దినేష్‌గౌడ్, శరత్, రైల్వే నాగేంద్ర, ధారా హరినాథ్‌రెడ్డి, ఆర్ట్ రమణ, సుంకన్న, వెంకట్రాముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పోస్టుపసాద్, భాస్కర్, జనార్దన్, మల్లికార్జున, వెంకటేష్, డంకేష్, నాగార్జున, రైల్వే నాయుడు, ఎద్దుపెంట వెంకటేశ్వర్లు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



నగరవనంలో విద్యార్థులతో ఫారెస్ట్ అధికారులు

డోన్: ప్రకృతిలోని ప్రతిప్రాణి పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతాయని రాష్ట్ర జంతు సంక్షేమ బోర్డు మెంబర్, స్నేక్ రెస్క్యూయర్ మొహమ్మద్ ఇద్రూస్ అన్నారు. నేచర్ క్యాంప్‌లో భాగంగా శుక్రవారం పట్టణ సమీపంలోని నగరవనంలో పట్టణానికి చెందిన విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణలో ప్రాణులపాత్రపై ఆయన అవగాహన కల్పించారు. పాముల జీవన విధానం, వ్యవసాయ రంగంలో, పర్యావరణంలో పాముల పాత్రను వివరించారు. అదేవిధంగా పాముకాటు నుంచి ఎలా తప్పించుకోవాలి, కాటుకు గురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో పాముల పాత్ర ముఖ్యమైనదని, వాటిని చంపకుండా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, సెక్షన్ ఆఫీసర్ మౌలాలి, బీట్ ఆఫీసర్లు సునిత, మహేశ్వరి, శివమ్మ, భారతి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న నీలిమ సంధ్య

బేతంచెర్ల: కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డోన్ కార్మిక సహాయ అధికారిణి నీలిమ సంధ్య సూచించారు. పట్టణం సమీపాన వెలసిన చౌడేశ్వరీ మాత ఆలయం ఆవరణలో ఏపీ ప్రైవేట్ ఎలక్ట్రికల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు లింగమూర్తి, అధ్యక్ష, కార్యదర్శులు సూర్యచంద్రారెడ్డి, భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ అసోషియేషన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వర్తించాలంటే ఈ శ్రమ కార్డు కోసం నమోదు చేసుకోవాలన్నారు. కార్డు ద్వారా ప్రభుత్వం అందించే అన్నిరకాల పథకాలు వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఇబ్రహీమ్ బాషా, మైమూద్, శేషిరెడ్డి, ఫనికుమార్, మోహనచారి, రామేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

కొలిమిగుండ్ల: నంద్యాలలో ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వైవీఎస్ నారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బేస్‌బాల్ స్టేట్ మీట్ ఈనెల 28నుంచి 30 వరకు తూర్పు గోదావరి జిల్లాలో కాకినాడలో జరుగుతాయన్నారు. ఈపోటీలకు అండర్–14 విభాగంలో ఇందు, హజీరా, సుధాకర్, అండర్17 విభాగంలో ధనలక్ష్మి, సాయికిరణ్ ఎంపికై నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పీడీ షెక్షావలి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గువ్వల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మానవ తప్పిదాలతోనే ప్రమాదాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న క్రాంతికుమార్

డోన్ టౌన్: అతి వేగం, మానవ తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువ చోటు చేసుకుంటున్నాయని ఎంవీఐ క్రాంతికుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు రోడ్డు నీయమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిద్రలేమితో బస్సు నడపరాదన్నారు. మద్యం సేవించి, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం మూలంగా ప్రమాదాలు జరుగుతాయన్నారు. రోడ్డుపై ఉండే సూచికల బోర్డులోని గుర్తులను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. ఓవర్ టేక్, మలుపుల ప్రాంతాల్లో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పక్కీర, హెడ్ క్లర్క్ నాగాంజనేయులు, గ్యారేజ్ అధికారి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు భూపంపిణీ చేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు దండువీరయ్య, నాయకులు

కొలిమిగుండ్ల: అర్హులైన మహిళలకు మూడు ఎకరాల చొప్పున ప్రభుత్వ భూమిని పంపిణీ చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య కోరారు. శుక్రవారం వివిధ గ్రామాల నాయకులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం చేరుకొని తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు మాదిగలు చాలా మంది భూమి లేని నిరుపేదలు వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నార న్నారు. అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి ప్రతి గ్రామంలో అర్హులను గుర్తించి అసైన్‌మెంట్ కమిటీ ద్వారా భూ పంపిణీ చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు క్రిష్ణయ్య, నాయకులు మాధవ, బాల ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

శివాలయ అభివృద్ధికి రూ.20వేలు విరాళం



నగదు అందజేస్తున్న శివ స్వాములు

డోన్ : శివాలయం అభివృద్ధికి తారక రామనగర్‌కు చెందిన చంద్రశేఖర్ అనే శివస్వామి శుక్రవారం రూ.20వేలు ఆలయ కమిటీ అధ్యక్షులు నాగార్జునగౌడ్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానఅర్చకులు హరిస్వామి, శివ స్వాము లు మద్దిలేటి, శ్రీరాములు, ప్రసాద్, మహేష్, వెంకట్రాముడు, మురళీధర్, ఈశ్వర్, శ్రీను, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు అందజేత



వృద్ధులకు నూతన వస్త్రాలు అందజేస్తున్న దాతలు

డోన్: పట్టణంలోని తారకరామనగర్‌కు చెందిన వ్యాపారవేత్త అశోక్ గౌడ్, లక్ష్మి దంపతులు తమ కుమారుని జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక వైఎస్ఆర్ నగర్‌లోని హోసన్నా వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు అందజేశారు. అదేవిధంగా వృద్ధులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు జాన్ ప్రభాకర్, సూపర్‌వైజర్లు భారతి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి అల్లాబకాష్ ఖాద్రీ ఉరుసు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురంలో వెలసిన హజరత్ సయ్యద్ షా అల్లా బకాష్ ఖాద్రీ దర్గా ఉరుసు ఉత్సవాలు ఈనెల 29 నుంచి నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 29న గంధం, 30 ఉరుసు, 31 కిస్తీలు (జార్తుల) కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని 29వ ఏపీ, తెలంగాణా రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేత జట్లకు వరుసగా రూ. 30 వేలు, రూ.20 వేలు, రూ. 10 వేల నగదు బహుమతులు అందజేస్తామన్నారు. అదేవిధంగా 30వ తేదీన న్యూకేటగిరి వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేత వృషభాల యాజన్యాలకు వరుసగా రూ.30 వేలు, రూ. 20 వేలు, రూ. 10 వేలు, రూ. 5 వేల చొప్పు నగదు బహుమతులను ప్రదానం చేస్తామని వివరించారు.

గ్రామచావిడి ప్రారంభోత్సవం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని కమ్మవారిపల్లెలో గ్రామ పెద్దలు,ప్రజల సహకారంతో నిర్మించిన గ్రామ చావిడిని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభోత్సవం చేశారు. గతంలో ఉన్న చావిడి శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్తుల సహకారంతో రూ.8లక్షలు వెచ్చించి సౌకర్యంగా నిర్మించినట్లు గ్రామ పెద్దలు చెప్పారు.

అక్కదేవతల ఆలయంలో జెడ్పీ చైర్మన్ పూజలు

కొలిమిగుండ్ల: స్థానిక నాయినపల్లె రోడ్డులోని అక్కదేవతల ఆలయం మూడవ వార్షికోత్సవాన్ని పురష్కరించుకొని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పేరం సత్యనారాయణరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, నందకిషోర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయం వార్షికోత్సవం సందర్భంగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను జెడ్పీ చైర్మన్ కట్ చేశారు. అనంతరం చైర్మన్‌తోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులను నిర్వాహకులు సన్మానించారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం నిర్వహించారు. చెక్క భజన కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది.

ఘనంగా కృష్ణదేవరాయల జయంతి



శ్రీకృష్ణదేవరాయల చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బలిజ సేవా సంఘం నాయకులు

బనగానపల్లెరూరల్: స్థానిక ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో శ్రీకృష్ణ దేవరాయల 553వ జయంతిని శ్రీ కృష్ణదేవరాయ బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా సంఘం గౌరవాధ్యక్షులు రామసుబ్బయ్య, అధ్యక్షులు వెంకటేశ్వర్లు మాట్లాడారు. శ్రీ కృష్ణ దేవరాయల పాలనలో అన్నివర్గాల ప్రజలు సుభిక్షంగా ఉన్నారన్నారు. ఆయనను భారతదేశాన్ని పాలించిన గొప్ప రాజుల్లో ఒక్కడిగా భావిస్తారని, ఆయన ఆంధ్రభోజుడుగా కీర్తింపబడ్డారని గుర్తు చేశారు. పట్టణంలో జరుగుతున్న ఫోర్‌లైన్ అభివృద్ధి పనులు పూర్తికాగానే శ్రీకృష్ణ దేవరాయల విగ్రహాన్ని ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులడు కొట్టె రవిప్రకాష్, బండికారి వెంకటయ్య, నాయకులు నీలిశ్రీనివాసులు, రామసుబ్బారెడ్డి, ఆకుల శాంతనుడు, నీలి రమేష్,మధు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ అబ్దుల్‌షఫీ

డోన్ రూరల్ : చిరుధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలని ఏఓ అబ్దుల్‌షఫీ, సర్పంచ్ శ్రీవిద్య సూచించారు. అంర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం 2023 పురస్కరించుకుని మండల పరిధిలోని యు.కొత్తపల్లి రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం చిరుధాన్యాల సాగు ఆవశ్యకతపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పుడు ఉన్న పరిస్థితుల మేరకు చిరుధాన్యాల సాగు లాభదాయకమన్నారు. సజ్జలు, కొర్రలు, రాగులు సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి చంద్రశేఖర్, గ్రామ వ్యవసాయ సహాయకుడు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: ఫీడర్లకు మరమత్తుల నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6.30గంటల వరకు గోసానిపల్లె, కొచ్చెర్వు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నాగేశ్వరరెడ్డి శుక్రవారం తెలిపారు. అదేవిధంగా వారం రోజులపాటు వ్యవసాయానికి సరఫరా చేసే సమయంలో మార్పు ఉంటుందన్నారు. త్రీఫేస్ కరెంట్ సరఫరాను ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మాత్రమే ఉంటుందన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరం

బేతంచెర్ల: మానసిక ఉల్లాసాని క్రీడలు అవసరం అని గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గోరుమానుకొండ తండా ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. హెచ్‌ఎం శ్రీనివాసులుతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విరామ సమయంలో విద్యార్థులకు కబడ్డీ పోటీలను నిర్వహించారు. విద్యతోపాటు క్రీడలపై దృష్టి సారించాలని ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటేశ్వర్లు విద్యార్థులకు సూచించారు.

మహిళలు స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి నాగరాజు

కొలిమిగుండ్ల: మహిళలు స్వయం ఉపాధిపై దృష్టి సారించాలని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రామ్‌కో సిమెంట్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ రెడ్డి నాగరాజు సూచించారు. కొలిమిగుండ్లలో ఆ కంపెనీ సామాజిక బాధ్యత కింద ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్, ఎంబ్రాయిడరీ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలిమిగుండ్ల, బెలుం గ్రామాలకు చెందిన 40 మంది మహిళలకు మూడు నెలలపాటు బనగానపల్లెకు చెందిన లావణ్య మహిళా మండలి సభ్యులు శిక్షణ ఇస్తారని చెప్పారు. ఆర్థికాభివృద్ధితోనే వ్యక్తిగత స్వేచ్ఛ లభిస్తుందనే విషయాన్ని మహిళలు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్‌లు రవికుమార్, ఫారూక్ మహ్మద్, మహిళా మండలి అధ్యక్షురాలు రోజా రమణి తదితరులు పాల్గొన్నారు.